
ప్రజాశక్తి

మంగళవారం 25 జూన్ 2024

5

పార్వతీపురం మన్యం





పార్లమెంటులో లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న విజయనగరం, అరకు ఎంపిలు కలిశెట్టి అప్పలనాయుడు, తనూజారాణి

మన్యం జిల్లాపై మంత్రి పట్టు బిగిస్తారా?

గత మంత్రుల కంటే భిన్నంగా పని చేసే అవకాశం

సంధ్యారాణే పార్టీలో సీనియర్ నాయకులు



ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లాపై గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పట్టు బిగిస్తారా? లేదా? అన్న చర్చ మొదలైంది. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణికి సిఎం చంద్రబాబునాయుడు కీలకమైన రెండు శాఖలు అప్పగించారు. గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రిగా సంధ్యారాణి మన్యం జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత ఆమె మూడో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఇద్దరు ఎమ్మెల్యేలు పుష్ప శ్రీవాణి, రాజన్నదొర గిరిజన సంక్షేమ శాఖ మంత్రులుగా పని చేశారు. వీరిద్దరూ జిల్లా రాజకీయాలను శాసించే స్థాయిలో పని చేయలేదనే అభిప్రాయం అప్పట్లో వ్యక్తమైంది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఆవిర్భవించిన పార్వతీపురం మన్యం జిల్లాను నడిపించే స్థాయిలో వైసిపి మంత్రులు పని చేయలేదు. అప్పటి ఉమ్మడి జిల్లా అగ్రనాయకుల కనుసన్నల్లో వారు పని చేశారనే ప్రచారం జరిగింది. జిల్లా అధికార యంత్రాంగంపై కూడా గతంలో పని చేసిన మంత్రులిద్దరూ పట్టు సాధించిన దాఖలాల్లేవు. జిల్లా స్థాయి అధికారులతో నిర్వహిం చిన సమీక్ష సమావేశా ల్లోనూ గిరిజన మంత్రుల ఆధిపత్యం ఎక్కడా కనిపించలేదు. ఒకవిధంగా చెప్పాలంటే వైసిపి ప్రభుత్వ హయాంలో గిరిజన సం క్షేమ శాఖ మంత్రు లిద్దరూ వారి నియోజక ‘వర్గాలకే పరిమిత మయ్యారు. ఇలాంటి పరిస్థి తుల్లో మన్యం జిల్లా నుంచి గుమ్మడి సంధ్యారాణి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వంలో ఆమె కీలకపాత్ర పోషించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. విజయనగరం జిల్లా నుంచి మంత్రిగా ఎంపికైన కొండపల్లి శ్రీనివాస్ కంటే సంధ్యారాణి సీనియర్ నాయకులు కావడంతో ఉమ్మడి జిల్లా రాజకీయాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఆమె జిల్లా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలిగా, అరుకు పార్లమెంటు పార్టీ అధ్యక్షురాలిగా ఆమెకు అనుభవం ఉంది. మన్యం జిల్లాలో ఇప్పుడున్న టిడిపి ఎమ్మెల్యేలందరి కంటే మంత్రి సంధ్యారాణి సీనియర్ నాయకురాలు కావడం, గతంలో ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఆమెకు కలిసొచ్చే అంశాలుగా వున్నాయి. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మొదటిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారే. దీంతో మన్యం జిల్లాలో మంత్రి సంధ్యారాణి కీలకపాత్ర పోషించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జిల్లా అధికారయంత్రాంగంపై కూడా ఆమె పట్టు బిగించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఐటిడిఎకి జవసత్వాలు తీసుకొస్తారా?

మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత పార్వతీపురం ఐటిడిఎ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఒకరకంగా చెప్పాలంటే వైసిపి ప్రభుత్వం ఐటిడిఎని ఉత్సవ విగ్రహంగా మార్చేసింది. గిరిజన సమస్యల పరిష్కారానికి కనీస స్థాయిలో నిధులు ఖర్చు చేయగలిగిన ఆర్థిక స్తోమత కూడా లేని పరిస్థితి ఏర్పడింది. గడచిన ఐదేళ్లలో ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు ఒక్కసారి కూడా నిర్వహించలేదు. దీంతో గిరిజన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఏమేరకు ఐటిడిఎకి పూర్వవైభవం తీసుకొస్తారనే చర్చ జరుగుతోంది.

స్టాప్ డయేరియా

1 నుంచి జిల్లా వ్యాప్తంగా

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అతిసార నివారణ ప్రచార కార్యక్రమాన్ని (స్టాప్ డయేరియా కాంపెయిన్) పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. అతిసార నివారణ ప్రచార కార్యక్రమాన్ని జూలై 1 నుంచి ఆగష్టు 31 వరకు రెండు నెలల పాటు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని ఆయన చెప్పారు. ఈ మేరకు జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, తాగునీరు పారిశుధ్య శాఖ, పట్టణాభివృద్ధి, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి వారం చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహించి అతిసార ప్రబలుటకు అవకాశం ఉన్న స్థలాలను గుర్తించి అక్కడ ఉన్న చెత్తను శుభ్రం చేయాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని, పూడికలు తొలగించడం, ముఖ్యంగా మార్కెట్‌లు, ఆహార పదార్థాలు విక్రయించే స్థలాలు, మురికివాడలు, తాత్కాలిక నివాసాలు వద్ద దృష్టి సారించాలని సూచించారు. చెత్త సేకరణ, వాటి రవాణాపై ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టాలని, వర్షాకాలంలో మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రజా మరుగుదొడ్లను నిరంతరం శుభ్రపర్చాలని, అతి ప్రమాదకర స్థాయిలో ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించాలని ఆయన చెప్పారు. అన్ని తాగునీటి పథకాలపై దృష్టి సారించాలని, సమయానుసారంగా క్లోరినేషన్ చేయడం, తాగు నీటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. బావులు, బోరు బావులు, కొళాయిలను తక్షణం తనిఖీ చేయాలన్నారు. తాగు నీరు మురికి నీరు కలుషితం కావడం వల్ల అతిసార ప్రబలుటకు ఎక్కువ అవకాశాలున్నాయని, వాటిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఇందుకు ఎంపిడిఒలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ సహాయకులు నీటి వసతుల నుంచి కుళాయి వరకు పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలలో తాగు నీరు, మరుగుదొడ్లను తనిఖీ చేసి ఎటువంటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో, పాఠశాలల్లో చేతులు శుభ్రతపై చిన్నారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు సమావేశం నిర్వహించాలని, అందులో చేతులు శుభ్రత, వ్యక్తిగత పారిశుధ్యంపై విధిగా చర్చించాలని ఆయన చెప్పారు. ఐదేళ్లలోపు చిన్నారుల జాబితా సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్లు, ఐవి ఫ్లూయిడ్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. చిన్నారులకు టీకా కార్యక్రమం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సౌర విద్యుత్‌తో పనిచేసే తాగు నీటి పథకాలు పనిచేయని పరిస్థితి ఉంటే తక్షణం మరమ్మతులు చేయించాలని ఆయన అన్నారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, జెసి ఎస్ఎస్ శోభిక, ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవ నాయుడు, డిఎంహెచ్ఒ విజయ పార్వతి, ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ కొయ్యాన అప్పారావు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు సత్యం నాయుడు, కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, డిఇఒ జి.పగడాలమ్మ, ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి, జిల్లా మలేరియా అధికారి టి జగన్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, అధికారులు

సీతానగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూలై 1 నుండి ఆగస్టు 31 వరకు జరుగునున్న స్టాప్ డయేరియా అమలుపై వివిధ శాఖ అధికారులతో ఎంపిడిఒ కె.ఈశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ రెండు నెలలు ప్రజలు ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పవన్‌కుమార్, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతంపేట : స్టాప్ డయేరియా కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ గీతాంజలి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సహకారంతో అన్ని పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్యం, క్లోరినేషన్ కార్యక్రమాల్లో ఆశా, ఎఎన్ఎం, అంగన్వాడీలు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. వైద్య సిబ్బంది వ్యాధులపై తెలపాలన్నారు. సమావేశంలో సిడిపిఒ పి.రంగలక్ష్మి, వైద్య సిబ్బంది కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు



కురుపాంలో కురుస్తున్న వర్షం

వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అల్లాడుతున్న నేపథ్యంలో సాయంత్రం ఆకాశం పూర్తిగా మబ్బులు మాయమై భారీ వర్షం కురవడంతో ఉపశమనం లభించింది. ఈ వర్షాలతో వ్యవసాయ పనులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సాగు సన్నద్ధతలో భాగంగా దుక్కులకు లాభిస్తుందని రైతులు అంటున్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. గత పది రోజులుగా తీవ్ర ఉష్ణోగ్రతలు నేపథ్యంలో సోమవారం కురిసిన వర్షంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేడెక్కిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఖరీఫ్ పనులు ప్రారంభానికి ఎదురుచూసిన రైతులు వర్షంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు, మూడు వర్షాలు కురిస్తే వ్యవసాయ పనులు ప్రారంభానికి అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

వీరఘట్టం : మండలంలో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలన్నీ పరిష్కారం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రతి సమస్యా పరిష్కారం కావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సమస్య పరిష్కారం దిశగా యోచిస్తుందన్నారు. సుపరిపాలన, సమర్థత, అవినీతి రహిత వ్యవస్థ లక్ష్యంగా పనిచేస్తుందని ఆయన చెప్పారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోనూ మంచినీటి ట్యాంక్‌లను శుభ్రపర్చాలన్నారు. తాగు నీరు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంచి నీటి పైపులు ఎక్కడైనా లీకులు ఉన్నాయా లేదో తనిఖీ చేసి, లీకులుంటే పైపులు మార్చాలని నాలుగు మున్సిపాల్టీల కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. డ్రైనేజీ ప్రదేశంలో మంచి నీటి పైపులు లీకులుంటే మంచి నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని ఆ నీరు తాగి ప్రజల ఆరోగ్యం పాడైతే మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్, శానిటేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులపై తీవ్ర చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి రోజూ చేతులు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టాలని, చేతులు ఎలా శుభ్రపరచుకోవాలో పిల్లలకు వివరించాలని తెలిపారు. అనంతరం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 124 అర్జీలు అందాయి. ప్రజల నుంచి కలెక్టర్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవనాయుడు అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్‌పి

ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియపర్చి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. కార్యక్రమంలో 14 ఫిర్యాదులు అందగా ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.లక్ష్మణరావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ బిఎండి ప్రసాదరావు, డిసిఆర్‌బి ఎస్ఐ గోవింద రావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

పూర్ణ పాడు -లాబేసు వంతెన పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కొమరాడ మండలంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెన పనులను వెంటనే పూర్తి చేయించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శోభికకు వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొమరాడ మండలానికి సంబంధించి తొమ్మిది పంచాయతీల పరిధిలోని 45 గిరిజన గ్రామాలకు ఉపయోగకరమైన పూర్ణపాడు -లాబేసు వంతెన 18 ఏళ్లుగా అసంపూర్తిగా 60 శాతం పనులు పూర్తి చేసి ఇంకా 40 శాతం పెండింగ్ పనుల కోసం 18 ఏళ్ల పట్టిందని అన్నారు. కావున వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేయాలని జెసిని కోరారు. దీనికి స్పందించిన ఆమె పంచాయతీరాజ్ శాఖ ఇఇ కృష్ణాజీని పిలిపించి దర్యాప్తు చేపట్టి ఎంతవరకు పనులయ్యాయని, ఎందుకు పెండింగ్ పనులు ఉన్నాయి వివరాలన్నీ కూడా వెంటనే తెలపాలని ఆదేశించారు.

రోడ్డు పనులకు అటవీశాఖ అనుమతులివ్వాలి

కొమరాడ మండలంలోని మసిమండ పెద్ద శాఖ కుంతీసు, పూడేశు పంచాయతీలకు సంబంధించిన గిరిజనులకు గిరిజన గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైన రహదారి పనులకు అటవీ శాఖ వెంటనే అనుమతి మంజూరు చేయాలని సాంబమూర్తి కలెక్టర్‌కు వినతిని అందజేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖ ఇఇ కృష్ణాజీని పిలిపించి మాట్లాడారు. అలాగే పార్వతీపురం డిఎఫ్ఒతో ఫోన్‌లో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

హెటిరో డ్రగ్స్‌కు 18 మంది ఎంపిక

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 18 మంది ఎంపికయ్యారు. జాబ్ మేళాకు మొత్తం 50మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీకి 18మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషశ్రీ తెలిపారు.



తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

తోలుంగూడకు మంచినీటి సౌకర్యం కల్పించాలి

కలెక్టరేట్ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కురుపాం మండలం తొలుంగూడకు మంచినీటి సౌకర్యం కల్పించాలని కాకిలి నుంచి తొలుంగూడ మీదగా లిక్కిడి సెంటర్‌కు బిటి రోడ్డు వేయాలని కలెక్టరేట్ వద్ద సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం.అడ్డుమేశ్వరరావు మాట్లాడుతూ తోలుంగూడకు మంచినీటి సౌకర్యం లేకపోవడంతో ఊటగెడ్డల నీరు తాగుతున్నామని తెలిపారు. ఈ ఊటనీరు తాగడం వల్ల గిరిజన ప్రాంతంలో మలేరియా, డయేరియా వంటి జబ్బులు వస్తున్నాయన్నారు. అలాగే తొలుంగూడలో కేవలం 80 అడుగుల లోతులోనే బోరు తీశారని, ఇది ఫిబ్రవరి నెల వచ్చేసరికి పూర్తిగా ఎండిపోతుందని తెలిపారు. అప్పటి నుండి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న లిక్కిడి గ్రామానికి వెళ్లి మంచినీరు తెచ్చుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క తొలుంగూడే కాకుండా వబ్బంగి, దండసూర తదితర గిరిజన గ్రామాల్లో మంచినీటి సౌకర్యం లేదని, దీనివల్ల మన్యం ప్రాంతమంతా మలేరియా, డయేరియా బారినపడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తొలుంగూడకు వెంటనే మంచినీటి బోరు మంజూరు చేయాలని వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు

అలాగే కాకిలి సెంటర్ నుండి తోలుంగూడ మీదుగా లిక్కిడి సెంటర్ వరకు 20 ఏళ్ల క్రితం వేసిన మెటల్ రోడ్డు పూర్తిగా పాడైపోయిందని, కనీసం నడవడానికి అవకాశం లేదని తెలిపారు. దీంతో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు. తాము అటవీ ఉత్పత్తులు అమ్ముకోవడానికి, సరుకులు కొనుక్కోవడానికి ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. కాకిలి సెంటర్ నుండి తోలుంగూడ మీదుగా లిక్కిడ్ సెంటర్ వరకు గత ప్రభుత్వంలోని రోడ్డు మంజూరైందని, కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాకిలి సెంటర్ నుండి తొలుంగూడ మీదుగా లిక్కిడి సెంటర్ వరకు బిటి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు, ఐటిడిఎ పిఒకు వినతిని అందజేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, కొల్లి సాంబ మూర్తి, గిరిజన సంఘం నాయకులు మండంగి రామారావు గిరిజనులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో రోగాలు దూరం : డిఎస్ఒ

ప్రజాశక్తి - పాచిపెంట

చేతులు శుభ్రతతో రోగాలు దరిచేరవని డిఎస్ఒ ఆర్.శివప్రసాద్ తెలిపారు. మండలంలోని పనుకువలస అంగన్‌వాడీ కేంద్రం వద్ద సోమవారం చేతులు శుభ్రతతో కలిగే ప్రయోజనాల గురించి పిల్లలకు సిడిపిఒ బి.అనంతలక్ష్మి అవగాహన కల్పించారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని, భోజనం చేసేముందు, చేసిన తర్వాత రోజుకు ఆరు నుంచి పది సార్లు చేతులు శుభ్రపర్చుకోవాలని సూచించారు. కాలకృత్యాలు చేశాక సబ్బుతో చేతులు శుభ్రపరుచుకోవాలని, కాచిన నీళ్లు తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్నాల వీధిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని బార్నాల వీధిలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.అనూష, ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ సత్యనారాయణ

సురక్షితమైన నీటిని అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రజలెవరూ డయేరియా, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు నేపథ్యంలో ప్రతి గ్రామంలో ఉన్నటువంటి తాగునీటి ట్యాంకు వద్ద క్లోరినేషన్ చేయించి ఎక్కడా పైపులు లీకేజీ లేకుండా చూసుకొని సురక్షతమైన తాగునీరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో డయేరియా ముందస్తు సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేణుగోపాల్, మేజర్ పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అధికారులకు వినతిని అందజేస్తున్న హెల్త్ వర్కర్లు

గతంలో పనిచేసిన వారినే విధుల్లోకి తీసుకోవాలి

అధికారులకు ఆదివాసీ ఆరోగ్య హెల్త్ వర్కర్లు వినతి

ప్రజాశక్తి -సీతంపేట

గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో గతంలో ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర వసతి గృహాల స్కూల్ ఆరోగ్య కార్యకర్తల అధ్యక్షులు బి.రామ్మోహనరావు అధికారులకు సోమవారం వినతిని అందజేశారు. సోమవారం స్థానిక ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో ఎపిఒ గణేష్, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలు విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుతూ అనారోగ్యం బారినపడకుండా కాపాడారన్నారు. గత వైసిపి ప్రభుత్వం అర్థాంతరంగా వారిని కొనసాగించలేదన్నారు. దీంతో అనేక మంది వ్యాధుల బారినపడి మృత్యువాత కూడా పడ్డారన్నారు. కావున ఇప్పటికైనా ప్రస్తుత కొత్త ప్రభుత్వం స్పందించి విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గతంలో పనిచేసిన ఆరోగ్య కార్యకర్తలను కొనసాగించాలని ఆయన కోరారు. వినతిని అందజేసిన వారిలో పలువురు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : గిరిజన విద్యార్థులకు గతంలో వైద్య, ఆరోగ్య సేవలు అందించిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందినే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదివాసీ ఆరోగ్య హెల్త్ వాలంటీర్లు కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల వేదికలో జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పనిచేసిన తాము 24 గంటలు గిరిజన విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకున్నామని తెలిపారు. చాలీచాలని జీతాలతో, సమయానికి జీతాలు రాకపోయినా గిరిజన విద్యార్థులకు నిత్యమూ వైద్య సేవలందించామని తెలిపారు. ఇప్పటికీ జీతాల బకాయిలు ఉన్నాయని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మడి సంధ్యారాణి ఎఎన్ఎంల నియామకపు దస్త్రాలపై మొదటి సంతకం చేయడం అభినందనీయమని, హర్షణీయమని వారన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్ల సురేష్ ,హెల్త్ వాలంటీర్లు పాల్గొన్నారు.

చేయూత డబ్బులు జమ చేయాలి

కలెక్టరేట్ వద్ద మహిళలు ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మహిళలకు చేయూత డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో వేయాలని పార్వతీపురం మండలం బందలుప్పి, గరుగబిల్లి మండలం రావుపల్లి గ్రామాలకు చెందిన మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణతో కలిసి నిరసన తెలిపి, కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం 45ఏళ్లు దాటిన మహిళలకు ఐదేళ్ల పాటు చేయూత పథకం కింద రూ.18700 బ్యాంకు ఖాతాల్లో వేసిందని, ఈ ఏడాది చివర్లో రూ.18,700 మహిళల బ్యాంకు ఖాతాల్లో వేయడానికి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కినా ఎన్నికల నిబంధనలు అమల్లో ఉండడంతో కొద్ది మందికి మాత్రమే జమ చేశారని మిగిలిన వారికి జమ చేయలేదని తెలిపారు. కావున కొత్తగా ఎన్నికైన టిడిపి ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని 45ఏళ్లు దాటిన చేయూత మహిళలందరికీ రూ.18700 వెంటనే బ్యాంకు ఖాతాలో వేయాలన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ ఈ సమస్యపై ఈనెల 26న మళ్లీ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని, దీనికి లబ్ధిదారులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు



ఎమ్మెల్యే జగదీశ్వరికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఎమ్మెల్యే జగదీశ్వరికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రమాణ స్వీకారం అనంతరం ఆదివారం రాత్రి గుమ్మలక్ష్మీపురం చేరుకున్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, స్నేహితులు హారతులతో ఘనస్వాగతం పలికారు. ఎల్విన్‌పేట నుంచి గుమ్మలక్ష్మీపురం బాణాసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేకు వైద్య సిబ్బంది అభినందనలు


ప్రజాశక్తి - జియ్యమ్మవలస

స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, వైద్య సిబ్బంది సోమవారం ఆమె స్వగ్రామమైన గుమ్మలలక్ష్మీపురం వెళ్లి అభినందనలు తెలిపారు. చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆమెను కలిసి ఆసుపత్రి సమస్యలను వెల్లడించారు. ప్రజా సమస్యలపై స్పందించిన ఆమె ఆసుపత్రికి అవసరమైన అన్ని సౌకర్యాలను మెరుగుపరుస్తామని ఇప్పటికే సామాజిక ఆరోగ్య కేంద్రం పనితీరు బాగుందని ఆమె వైద్యులను కొనియాడారు. అనంతరం సిబ్బంది ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు.

సవర భాష వాలంటీర్లను రెన్యువల్ చేయండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో పనిచేస్తున్న సవర విద్యా వాలంటీర్లను తక్షణమే రెన్యువల్ చేయాలని సవర విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో సీతంపేట ఐటిడిఎ పరిధిలో 150 మంది, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 176 మంది సవరభాష విద్యా వాలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. వీరికి ప్రతి ఏటా పాఠశాలలు పునఃప్రారంభించే నాటికి రెన్యువల్ చేస్తున్నారని, కానీ ఈ ఏడాది నేటి వరకు రెన్యువల్ చేయలేదని అన్నారు. సవర భాష విద్యా వాలంటీర్లను రెన్యువల్ చేయకపోవడంతో సవర భాషకు చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు స్పందించి తమను తక్షణమే నియమించాలని కోరారు. అలాగే తమకు ప్రతి ఏటా ఇస్తున్న గౌరవ వేతనాన్ని కూడా పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

పారిశుధ్యం మెరుగుపరచాలని వినతి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని 24 పంచాయతీల్లోని 38 గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని, కాలువల్లో పూడికలు తీసి దోమల మందు పిచికారీ చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలి సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిడిఒ రమేష్ నాయుడుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వై.మన్మధరావు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందని, గ్రామాల్లో ఇప్పటికే కాలువల్లో పూడుకలు తీయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని దోమలు విపరీతంగా ప్రబలుతున్నాయి. దోమల మందు పిచికారీ చేసి బ్లీచ్ పౌడర్ చల్లాలని, లేని పక్షంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వర్షాలు తీవ్రతరమవుతున్న కొద్దీ అంటువ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉందని, కావున 24 పంచాయల పరిధిలో గల 38 గ్రామాల్లో కాలువల్లో పూడికలు తీయించి పారిశుధ్య మెరుగుపరచాలని కోరారు కార్యక్రమంలో బద్దాన భానుమూర్తి, వెంకటస్వామి, రామారావు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా చూడండి

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఎంపిడిఒ రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ తో పాటు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలగాలని, తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. అలాగే రాబోతున్న వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఎటువంటి రోగాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వాటర్ ట్యాంక్ క్లోరినేషన్ చేసి ప్రజలకు శుభ్రమైన తాగునీరందించాలని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

ప్రజాశక్తి - పాలకొండ

ప్రజాస్వామ్యంలో పార్టీలు గెలుపు, ఓటములు సహజమని, వైసిపి కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఆ పార్టీ మండల కన్వీనర్ తోట సింహాచలం అన్నారు. భామినిలో ఎంపిపి, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు ఆధ్వర్యంలో వైసిపి కార్యకర్తలు సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎప్పటిలాగే ఎంపిపి ప్రతినిధిగా ప్రజలకు ప్రతి సోమవారం, గురువారం అందుబాటులో ఉంటానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి జులై 1,2,3 తేదీల్లో మండలంలోని వైసిపి కార్యకర్తలతో సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి కార్యకర్తలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైసిపి నాయకులు ఆగుతాముడి రఘు, నిమ్మల కేశవ, బిడ్డికి తమ్మారావు, గెల్లంకి రమేష్, తోఘరానా శ్రీను, పత్తిక సింహాచలం ఉన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు

సీతంపేటలో బడికిపోతా ర్యాలీ

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర, డిప్యూటీ డిఇఒ పి నారాయుడు, పిఎంఆర్సీ సిబ్బంది ఆధ్వర్యంలో "బడికి పోతా" భారీర్యాలీ కార్యక్రమం సీతంపేటలో సోమవారం నిర్వహించారు. సంతకు వచ్చిన గిరిజనులకు విద్యపై అవగాహన కల్పించారు. 6 నుండి 16 ఏళ్లు ఉన్న ప్రతి ఒక్కరూ పాఠశాలలోనే ఉండాలని, డ్రాపౌట్‌లు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిదీ అంటూ నినాదాలు ఇచ్చి చైతన్య పరిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందర్రావు, పద్మశ్రీ వసతిగహ అధికారి పాలక అమల, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, ఎంఇఒ సూర్యచంద్రరావు, స్పోర్ట్స్ ఇన్చార్జి జాకబ్ దయానంద్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



పింఛను కోసం కుమారుడ్ని ఐటిడిఎ కార్యాలయానికి వచ్చిన తల్లి సరోజనమ్మ

పెన్షన్ కోసం వికలాంగుడు ఎదురుచూపు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చాకలిగూడకు చెందిన సవర భాస్కరరావు, సరోజనమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరిలో రెండో కుమారుడైన సవర దుర్గారావు ఆరేళ్లయినా కనీసం నడవలేడు, కూర్చోలేడు. ఇప్పటికీ చిన్న పిల్లల మాదిరిగా డబ్బా పాలు తాగుతున్నాడు. అంతేకాక తల్లిదండ్రులు నిరుపేదలు. మానసికంగా కుమిలిపోయి ఏడాదిగా సచివాలయాలు, ఐటిడిఎ చుట్టూ పెన్షన్ ఇప్పించాలని కాళ్లు అరిగేలా తిరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క నిరుపేద కుటుంబం రెక్కాడితే డొక్కాడని ఆ కుటుంబం తమ స్థోమతతో దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించలేదు. కార్పొరేట్ ఆసుపత్రికి తన కుమారుడ్ని తీసుకెళ్లే స్థోమత లేదు. దీంతో చుట్టు పక్కల పిల్లల మాదిరిగా స్కూలుకు చకచక వెళ్లాల్సిన కుమారుడు ఇంటి వద్ద ఇలా తల్లి చాటున చమకులో ఉండడంతో వారు ఆవేదన వర్ణ తీరం



కుళాయి ద్వారా వస్తున్న తాగునీరు



విద్యుత్ తీగెలు సరి చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి వార్తలకు స్పందన

లంకజోడుకు తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - కురుపాం

తాగునీరు సక్రమంగా అందక మండలం లోని వలసబల్లేరు పంచాయతీ లంకజోడు గ్రామంలో ఇంటింటికీ తాగునీరు పథకం కొళాయి పాడై నెల రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో గ్రామంలో ఉన్న ఒకే చేతిపంపు నుంచి 500 మంది జనాభా ఆధారపడి గంటల తరబడి నిరీక్షించి తాగు నీరు తెచ్చుకుంటున్నారు. ఈ విషయమై 'ప్రజాశక్తి'తో సోమవారం ప్రచురితమైన 'లంకజోడులో తాగునీటి ఎద్దడి' అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు స్పందించి మరమ్మ తులకు గురైన బోరు ప్యానెల్ బోర్డును సోమవారం బాగు చేయించి ఇంటింటికి కొళాయి ద్వారా తాగు నీరందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తాగునీటి సమస్యను పరిష్కరించిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ తీగెలు సరి చేసిన సిబ్బంది

ప్రజాశక్తి - సీతంపేట

మండలం లోని బుడ్డిపేట గ్రామం వద్ద తోటపల్లి కాలువ సమీపాన కిందకు వేళాడుతున్న విద్యుత్ తీగెలను ఆశాఖ సిబ్బంది సోమవారం సరిచేశారు. 'యమపాసాలను తలపిస్తున్న విద్యుత్ తీగలు.. భయం గుప్పెట్లో రైతులు అన్న శీర్షికను ఈనెల 22న ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్ అధికారులు సోమవారం నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను, తీగలను సరిచేసి సరిచేశారు. దీంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

17న వాహనాల వేలం పాట

ప్రజాశక్తి - సాలూరు

వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 17 ద్విచక్రవాహనాలు, ఒక కారును ఈనెల 27న వేలం వేయనున్నట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఇబి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక సర్కిల్ స్టేషన్ ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఆధార్ కార్డు, నిర్ణీత ఇఎండి మొత్తాలతో వేలంపాటలో పాల్గొనవచ్చునని చెప్పారు. 18శాతం జిఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన రంజిత్ కుమార్

ప్రజాశక్తి - కురుపాం



లోకేష్‌కు బొకేను అందజేస్తున్న రంజిత్‌కుమార్

ఐటి, విద్య, ఆర్టీజీ శాఖల మంత్రిగా నారా లోకేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సచివాలయంలో ఆయన బ్లాక్ వద్ద తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని రంజిత్‌కుమార్ తెలిపారు.

లక్ష్మనాయుడు చెరువులో కబ్జాలు తొలగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ఐటిడిఎ కార్యాలయ సమీపంలో ఉన్న లక్ష్మనాయుడు చెరువులో కబ్జాలు తొలగించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు, పట్టణ అధ్యక్షులు శిగడాం భాస్కరరావు, మండల అధ్యక్షులు బలగ శంకరరావు తదితరులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐటిడిఎ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న లక్ష్మనాయుడు చెరువులో గత కొంతకాలంగా ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. కొంతమంది కబ్జా కోరులు చెరువును ఆక్రమించి పక్కా భవనాలు నిర్మిస్తున్నారన్నారు. ఇదేమంటే చెరువులో పట్టాలున్నాయంటూ సమాధానం ఇస్తున్నారన్నారు. చెరువుల్లో పట్టాలిచ్చిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే చెరువు లోపల అక్రమ నిర్మాణాలు తొలగించాలన్నారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆక్రమణలు జరిగే సమయంలో పనిచేసే అధికారులు, సిబ్బందిపై చర్యలు చేపట్టాలన్నారు. కొట్లాది రూపాయల విలువైన చెరువు స్థలాలను కబ్జా చేశారన్నారు. ఓ ప్రజా ప్రతినిధి అండదండలతో ఆక్రమణలు జరుగుతోందని ఆరోపించారు. తక్షణమే దీనిపై తగు దర్యాప్తు నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. దీనికి స్పందించిన కలెక్టర్ స్థానిక తహశీల్దార్ ఆనందరావుతో మాట్లాడి చెరువును పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ ఆనందరావు

భోజనం రుచికరంగా ఉండాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

చదువుతో పాటు విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం వీరఘట్టంలోని కూరాకులవీధిలో గల ఎంపిఇపి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రుచికరమైన భోజనం పెట్టడం వల్ల విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు శక్తి బలాన్ని లభిస్తుందని ఆ దిశగా ప్రతిరోజు రుచికరంగా భోజనం పెట్టాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ, డ్రింకింగ్, రన్నింగ్ వాటర్‌తో పాటు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆయనతో పాటు హెచ్‌ఎం డి.సువర్ణలత, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని వసాది గ్రామంలో సోమవారం మధ్యాహ్నం పిడుగు పడి వ్యక్తి మృతి చెందాడు పోలీసులు వివరాల ప్రకారం.. బోధంకి ఎర్నాయుడు (47) పొలంలో దొంకలు కొడుతుండగా పిడుగు తనపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు విజయనగరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య సూర్యడమ్మ ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బోధనేతర సిబ్బందికి కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బందికి కంప్యూటర్‌లో శిక్షణ కార్యక్రమాన్ని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయ సిబ్బంది తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీ డయోల్, డీన్ ప్రొఫెసర్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంపిడిఒ

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని స్థానిక తహశీల్దార్ ఆర్.రమేష్ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి గ్రామస్తులు సమస్యలపై వినతులు అందజేశారని, వారి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యకు నిర్ణీత కాలంలోనే పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిటి శివయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా

వీరఘట్టం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్థానిక ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా కొట్టారు. మండలంలోని అన్ని శాఖలకు సంబంధించి మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సిన ఉన్నప్పటికీ విద్య, ఉపాధి, పశు, వ్యవసాయ, ఉద్యానవనం, విద్యుత్, పంచాయితీరాజ్, మండల మహిళా సమైక్య, గృహ నిర్మాణ శాఖల అధికారులు మాత్రమే ఈ వేదికకు హాజరయ్యారు. మిగిలిన నీటిపారుదల, ఆర్అండ్‌బి, శిశు సంక్షేమ, ఆర్టీసీ, అటవీ, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరయ్యారు.



కురుపాంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి కార్యకర్త రామకృష్ణ

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌విఎస్‌ఎస్‌కె రంగారావు (బేబి నాయన) పుట్టినరోజు సందర్భంగా సోమవారం పార్వతీపురం పట్టణంలో ఆయన అభిమానులు, టిడిపి శ్రేణులు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి మజ్జి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతుబజార్ దగ్గర ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలో ఉన్న వారికి మజ్జి సోదరుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కురుపాం : బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన్ జన్మదినన్ని పురస్కరించుకొని సోమవారం కురుపాం టిడిపి కార్యాలయం వద్ద బేబినాయన అభిమాని చందక రామకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, టిడిపి నాయకులు కర్రి శ్రీను, మెరగాల మిన్న రావు, సువ్వాను వెంకటరమణ, బి. అజిత్ కుమార్, సామల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

రైతులను ఆదుకునేందుకు సాగునీటికి ప్రాధాన్యత ఇస్తానని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. మండలంలోని ముంజేరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు విత్తనాలను ఆమె చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సాగునీరు లేకపోవడం వల్ల రైతులు వ్యవసాయం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్న బోర్లలో నీరు సక్రమంగా రాక పంటలు వేయడం లేదని తెలిపారు. అందుకే ఈ సమస్యపై ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు.

'విద్యా ప్రవేశం' విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నూతన విద్యా సంవత్సరంలో మండలంలోని పాఠశాలల్లో విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఇఒ- 1 సామల సింహాచలం అన్నారు. సోమవారం మండల, మున్సిపల్ పరిధిలోని అన్ని యాజమాన్య ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సింహాచలం మాట్లాడుతూ విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో నెల రోజుల పాటు విద్యా ప్రవేశం కార్యక్రమం నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. స్టూడెంట్ కిట్స్‌ను ప్రతి విద్యార్థికి పంపిణీ చేయాలన్నారు. ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించాలని, ఫేషియల్ అటెండెన్స్‌ను తప్పనిసరిగా వేయాలని సూచించారు. విద్యా శాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల పేర్లను మార్పు చేయడం జరిగిందని వాటన్నింటినీ గమనించి కొత్త పేర్లను వినియోగించాలని ఆదేశించారు. రిజిస్టర్లు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, పాఠశాల పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశంలో ఎంఇఒ-2 కె.ప్రసాద రావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



భామిని వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

జిల్లాలో 30 వాహనాలపై కేసులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మన్యం జిల్లాలో 30 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి శశి కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల కట్టడికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. అధిక లోడులతో వెళ్తున్న వాహనాలను, ఆటోలను ఆపి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అంతేకాక వారి దగ్గర సరైన పత్రాలు ఫిట్నెస్ ఇన్సూరెన్స్ ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ క్రమంలో పార్వతీపురం, సాలూరు, పాలకొండ, భామిని తదితర ప్రాంతాల్లో ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గతో కలిసి దాడులు నిర్వహించామని తెలిపారు.

భామిని + భామిని ప్రధాన రహదారిలో పాలకొండ సహాయ ఇంధన శకట అధికారి జిఎన్ఎస్ఆర్‌కె కుమార్ ఆధ్వర్యంలో రవాణా సిబ్బంది వాహన తనిఖీలను సోమవారం చేపట్టారు. ఇటీవల కాలంలో ఆటోల్లో అధిక మొత్తంలో ప్రయాణిస్తున్న నేపథ్యంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో జిల్లా లో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని, వాహన పత్రాలు లేని వాహనాలు సీజ్ చేస్తున్నామని తెలిపారు. వాహనాలు ఫిట్టనెస్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపే వారికి అవగాహన కల్పిస్తున్నామని, రోడ్డు నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాద రుసుం వేస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో పాలకొండ ఆర్‌టిసి డిపో మేనేజర్ టి.వెంకటేశ్వరావు, పాలకొండ రవాణాశాఖ, ఆర్‌టిసి డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

ఖాతాదారులకు మెరుగైన సత్వర సేవలే లక్ష్యంగా విధులు నిర్వహిస్తానని ఆరికతోట ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు నూతన మేనేజర్ పెద్దింటి శ్రీనుబాబు తెలిపారు. సోమవారం బదిలీపై మక్కువ నుంచి వచ్చిన ఆయన ఇక్కడ విధుల్లో చేరారు. గత మూడేళ్లుగా ఇక్కడ మేనేజర్ పోస్ట్ ఖాళీగా ఉంది. ఫీల్డ్ ఆఫీసర్ క్యాష్ ఇన్చార్జితోనే నడుస్తుంది. ఇక మేనేజర్ కూడా విధుల్లో చేరడంతో ఖాతాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని రకాల బ్యాంకు సేవలు అందుబాటులోకి తీసుకు వస్తామని అన్ని రకాల రుణాలు త్వరితగతిన మంజూరు చేస్తానని, రుణ వాయిదాలు సక్రమంగా చెల్లించాలని మేనేజర్ కోరారు. సిబ్బంది నూతన మేనేజర్ శ్రీను బాబుకు ఘన స్వాగతం పలికారు.